

ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5



నిండుకుండలా మారిన శ్రీశైలం ప్రాజెక్టు

పంటల సాగుకు.. ధోకా లేనట్లే

- జూలై చివరి నాటికే నిండుకుండల్లా ప్రధాన జలాశయాలు
- వానాకాలం, యాసంగి సాగుకు ఇబ్బందులు ఉండవంటున్న రైతులు
- అక్టోబరు చివరి వరకు కృష్ణానదికి వరద రోజులు నమోదయ్యే అవకాశం
- ఈ వాటర్ ఇయర్‌లో జూరాలకు 221.587 టీఎంసీల మేర వరద
- స్థానిక నీటి పారుదలకు 8.801 టీఎంసీల నీటిని ఎత్తిపోసిన అధికారులు
- 207 టీఎంసీలు శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల


జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

మహబూబ్‌నగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు ఈ ఏడాది ధోకా లేనట్లేనని చెప్పొచ్చు. ప్రతీ ఏటా ఆరంభంలో ఊరించే వరద.. తర్వాత ముఖం చాటేయడంతో ఆయకట్టులో పంటలు ఎండిపోతున్నాయి. వానాకాలం సీజన్ ఎలాగోలా గట్టెక్కించినా.. యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా జూలై చివరి వారంలో ఎగువన ఉన్న ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి నీరు జూరాల ప్రాజెక్టుకు నీరు వచ్చి చేరుతోంది. ఈ ఏడాది అనుకున్న దానికంటే ముందుగానే జూరాలకు వరద పోటెత్తింది. ఎగువన ఉన్న ప్రాజెక్టులు త్వరితగతిన నిండటం, మహారాష్ట్ర, కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదుకావడంతో వరద ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో సాగునీటి పథకాలపై ఆధారపడిన వారికి వానాకాలం పంట వరద రోజుల్లోనే చేతికి వచ్చే అవకాశం ఉంది. అలాగే యాసంగి పంటలకు కూడా మెజారిటీ డిస్ట్రిబ్యూటరీలకు నీరు అందించే అవకాశం ఉంది. వరద వస్తున్న రోజుల్లో మెజారిటీ చెరువులను నింపుకుని.. వాటర్‌ను స్టోర్ చేసుకోవడం వల్ల భూగర్భ జలాలు కూడా పెరుగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యికి పైగా చెరువుల్లో నీటిని నింపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే గతేడాది వరద తక్కువగా రావడంతో ఎత్తిపోతల పథకాల ద్వారా సుమారు 80 టీఎంసీల నీటిని పంపింగ్ చేయాల్సి ఉండగా.. 45 టీఎంసీల మేరనే ఎత్తిపోశారు. అయితే ఈ ఏడాది వరద ముందుగా రావడంతో ఎత్తిపోతల పథకాల ద్వారా పంపింగ్ మొదలైంది. అక్టోబరు చివరి వరకు కూడా వరద రోజులు నమోదయ్యే అవకాశం ఉండటంతో ఇబ్బందులు ఉండవని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సామర్థ్యం మేర నీటిని ఎత్తిపోసుకుని చెరువులు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లలో స్టోర్ చేసుకునే అవకాశం ఉంది.

భారీగా వస్తున్న వరద..

ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు సైట్ వద్ద 3.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. 45 గేట్లు ఎత్తి 2.99 లక్షల క్యూసెక్కుల నీటితో పాటు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 18 వేల క్యూసెక్కులను దిగువన శ్రీశైలానికి వదులుతున్నారు. అలాగే నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కోసం 750 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ కోసం 630 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కులను ఎత్తిపోస్తున్నారు. ఎడమ కాలువకు 820 క్యూసెక్కులు, కుడి కాలువకు 658 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మొత్తంగా 3.21 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ప్రస్తుతం నమోదవుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.971 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అటు తుంగభద్రకు వరద పోటెత్తుతుండటంతో తుమ్మిళ్లతోపాటు ఆర్డీఎస్ కెనాల్‌కు నీటి విడుదల కొనసాగుతోంది. కర్ణాటకలోని టీబీ డ్యాంకు 1.78 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 1.54 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఆ ప్రాజెక్టు కూడా జూలై నెలలోనే నిండటం వల్ల వచ్చే నీరంతా దిగువకు వదలడంతో రాష్ట్ర పరిధిలో ఉన్న తుమ్మిళ్ల, ఆర్డీఎస్ ఆయకట్టుకు ధోకా ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక ఆలమట్టి, నారాయణపూర్ రిజర్వాయర్ల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం వద్ద 3.09 లక్షల క్యూసెక్కుల వరద నమోదవుతుండగా.. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.


భీమా ఫేజ్-2 లిఫ్ట్ ద్వారా శంకరసముద్రం రిజర్వాయర్‌లోకి విడుదలవుతున్న నీరు

221.587 టీఎంసీల వరద..

జూరాల ప్రాజెక్టుకు ఈ వాటర్ ఇయర్‌లో జూలై చివరి నాటికి 221.587 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఈ ప్రాజెక్టు ఆధారంగా నెట్టెంపాడు, భీమా ఫేజ్ 1, 2, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. మరోవైపు కుడి, ఎడమ కాలువల కింద దాదాపు 1.04 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటి వరకు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి 2.456 టీఎంసీల నీటిని ఎత్తిపోయగా.. భీమా లిఫ్ట్ 1కు 2.063 టీఎంసీలు, భీమా లిఫ్ట్ 2కు 1.7666 టీఎంసీలు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకానికి 0.650 టీఎంసీలు విడుదల చేశారు. అదే విధంగా జూరాల కుడి ప్రధాన కాలువకు 0.623 టీఎంసీలు, ఎడమ ప్రధాన కాలువకు 0.703 టీఎంసీలను వదిలారు. 0.605 టీఎంసీల నీరు ఆవిరి కాగా.. మొత్తంగా సాగునీటి పారుదల కోసం 8.801 టీఎంసీలను విడుదల చేసుకున్నారు. అలాగే విద్యుత్ ఉత్పత్తి కోసం 28.168 టీఎంసీలు, స్పిల్ వే ద్వారా 179.358 టీఎంసీలను దిగువకు వదిలారు. జూరాల నుంచి స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి ద్వారా మొత్తంగా శ్రీశైలానికి 207.526 టీఎంసీలను వదిలారు. వరద ఇంకా కొనసాగుతుండటంతో ఇంకా నీటిని ఉమ్మడి జిల్లా సాగునీటి పథకాల కోసం వినియోగించుకునే అవకాశం ఉంది. అలాగే శ్రీశైలం ప్రాజెక్టు కూడా ప్రస్తుతం నిండుకుండలా మారగా.. దానిపై ఆధారపడి ఉన్న మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి ప్రతీ రోజూ 1,600 క్యూసెక్కుల మేర నీటిని తీసుకుంటున్నారు. దీనిద్వారా ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లను స్టోర్ చేయడంతోపాటు డిస్ట్రిబ్యూటరీల ద్వారా చెరువులను నింపుతున్నారు.

ఎల్ఆర్ఎస్ లెక్క తేలేనా?

మహబూబ్ నగర్ మునిసిపల్ కార్యాలయం



- నాలుగేళ్ల క్రితం ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలోని పురపాలికల పరిధిలో ప్లాట్లకు 1,94,193, లేఅవుట్లకు 800 అప్లికేషన్లు
- ఫిబ్రవరిలో ప్రభుత్వం అవకాశం ఇచ్చినా ఆసక్తి చూపని దరఖాస్తుదారులు
- అధిక రిజిస్ట్రేషన్ ఫీజులే కారణం
- తాజాగా ఆన్‌లైన ద్వారా మూడు నెలల్లో దరఖాస్తులన్నీ పరిశీలన చేయాలని ఆదేశం

మహబూబ్‌నగర్, ఆగస్టు 1: పలు కారణాలతో నాలుగేళ్ల క్రితం నిలిచిపోయిన ఎల్ఆర్ఎస్ పథకాన్ని తిరిగి అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు ప్రజలు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం లభించింది. అనధికార లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. అప్పట్లో లేఅవుట్‌కు రూ.10 వేలు, ప్లాట్‌కు రూ.1000 చెల్లించి ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు చేసుకున్నారు. లక్షల్లో దరఖాస్తులు రావడంతో వాటిని స్క్రూట్నీ చేయడం అధికారులకు తలనొప్పిగా మారింది. దాంతోపాటు ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడంతో దరఖాస్తుదారులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఏడాది ఫిబ్రవరి 27న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని, వాటిని స్క్రూట్నీ చేసి మార్కెట్ విలువ ప్రకారం ఫీజులు తీసుకోవాలని ఆదేశించింది. అందుకు మార్చి 31 వరకు అవకాశం కల్పించినా చాలామంది లబ్ధిదారులు ముందుకురాలేదు. అయితే పెద్ద ఎత్తున దరఖాస్తులు ఉండటంతో ఒక్కో దరఖాస్తును పరిశీలించి, వారితో ఫీజులు వసూలు చేయడం సమస్యగా మారుతోంది.

మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో అధికం

ఉదాహరణకు పాలమూరు పురపాలిక పరిధిలో 31,144 ప్లాట్లకు, 250 లేఅవుట్‌లకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. అందులో మూడు వేల దరఖాస్తులను మాత్రమే స్క్రూట్నీ చేయగా, 129 మంది మాత్రమే ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకున్నారు. ఇలా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 19 పురపాలికల పరిధిలో 1,94,193 ప్లాట్లకు, దాదాపు 800 వరకు లేఅవుట్లకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. క్రమబద్ధీకరణ అనంతరం ఫీజులు చెల్లించాలంటే ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఒక్కో ప్లాట్‌కు రూ.లక్షల్లో ఫీజు చెల్లించాల్సి రావడంతో చాలామంది ముందుకు రావడం లేదు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ప్రభుత్వానికి రూ. వందల కోట్ల ఆదాయం సమకూరనుంది. వనపర్తి మునిసిపాలిటీలో 28,941, జడ్చర్లలో 17,564, గద్వాలలో 14,317, అచ్చంపేటలో 11,971, కల్వకుర్తిలో 11,443, నాగర్‌కర్నూల్‌లో 16,011, మక్తల్‌లో 10,498 దరఖాస్తులను స్క్రూట్నీ చేయాల్సి ఉంది.

కొత్త విధానంతో వేగంగా పరిశీలన

ఇదివరకు ఒక్కో దరఖాస్తును పరిశీలన చేసి.. అర్హత ఉన్నవాటిని ఓకే చేసి, అర్హత లేనివాటిని రిజెక్ట్ చేయాల్సి ఉండేది. అయితే ఇప్పుడు సుపరిపాలన కేంద్రం ద్వారా ఆన్‌లైన విధానంలో కేవలం మూడు నెలల వ్యవధిలో మొత్తం అప్లికేషన్లు స్క్రూట్నీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ఒక ప్రాంతాన్ని క్లస్టర్‌గా తీసుకుని, సర్వే నెంబర్ ఆధారంగా వెరిఫికేషన్ చేయనున్నారు. ఒక సర్వే నెంబర్‌లో 10 అప్లికేషన్‌లు ఉంటే అన్నింటిని ఒకేసారి వెరిఫికేషన్ చేయనున్నారు. దీనివల్ల సులువుగా, వేగంగా ప్రక్రియను పూర్తి చేయనున్నారు. అవసరమైతే శాటిలైట్ విధానాన్ని కూడా ఉపయోగించుకోనున్నారు. నాలుగు దశల్లో వడపోత కార్యక్రమాన్ని చేపడతారు. రెవెన్యూ, మునిసిపల్, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుంది. ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఎల్ఆర్ఎస్ పాత దరఖాస్తులను క్లియర్ చేయడంతోపాటు కొత్తగా వచ్చే దరఖాస్తులను కూడా తీసుకోవాలని నిర్ణయించింది. అయితే గతంలో ఎల్ఆర్ఎస్‌ను ప్రభుత్వం ఉచితంగా చేస్తుందని ప్రచారం ఉండటంతో చాలామంది ఫీజులు చెల్లించేందుకు ముందుకు రావడం లేదని చర్చ జరుగుతోంది. దీనిపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాల్సి అవసరం ఉంది. నిర్దీత కాలపరిమితి ఇచ్చి, ఆలోపు ఫీజులు చెల్లించని వారి అప్లికేషన్‌లు రిజెక్ట్ చేస్తామని చెబితే తప్ప ఎల్ఆర్ఎస్ లెక్క తేలేలా లేదని స్పష్టమవుతోంది.

జోరుగా వరి నాట్లు


ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతు


ఎద్దుల సహాయంతో నారు పరుస్తున్న రైతులు


నాట్లేస్తున్న మహిళా కూలీలు

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మహబూబ్‌నగర్ జిల్లాలో వరి నాట్లు జోరందుకున్నాయి. కొన్ని చోట్ల చెరువులు, కుంటల్లో నీరు నిండుగా చేరడంతో పాటు బోర్లలో నీళ్లు పుష్కలంగా వస్తున్నాయి. దాంతో రైతులు కరిగెట్లు చేసి, నాట్లు వేస్తున్నారు. ఉదయాన్నే పొలంబాట పట్టి, బిజీబిజీగా గడుపుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో వరి నాట్లు వేస్తున్న దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

పీవో హామీతో పాదయాత్ర వాయిదా

మన్ననూర్: ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోరుతూ నల్లమల చెంచులు అమ్రాబాద్ మండలం మన్ననూరు నుంచి అసెంబ్లీకి పాదయాత్ర చేసేందుకు గురువారం పూనుకున్నారు. ఉదయం చెంచుల సమస్యల సాధన కమిటీ నాయకుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో మన్ననూరు ఐటీడీఏ కార్యాలయం వద్దకు చేరుకొని, నినాదాలు చేశారు. అప్పటికే పాదయాత్రను అడ్డుకోవాలని మన్ననూరులో మొహరించిన పోలీసులు చెంచుల వద్దకు వచ్చారు. పాదయాత్రకు అనుమతి లేదని తేల్చి చెప్పారు. అమ్రాబాద్ సీఐ శంకర్‌నాయక్ చెంచులతో మాట్లాడారు. ఐటీడీఏ పీవోతో మీ సమస్యల గురించి మాట్లాడిస్తామని చెప్పారు. అనంతరం ఐటీడీఏ పీవో కార్యాలయం వద్దకు తీసుకెళ్లారు. చెంచులతో పీవో ముఖాముఖి నిర్వహించారు. 31 డిమాండ్ల గురించి చర్చించారు. మూడు దశాబ్దాలుగా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు, అధికారులు విఫలమవుతున్నారని, గతంలో పాదయాత్ర చేసిన సందర్భాల్లో అధికారులు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని చెంచులు చెప్పారు. మన్ననూరులోని ఐటీడీఏ కార్యాలయానికి రెగ్యులర్ పీవో తో పాటుగా అనుబంధ శాఖల అధికారులను నియమించాలని కోరారు. రోడ్లు, తాగునీరు, తమ పిల్లలు చదువుకునేందుకు పాఠశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చెంచులు కోరిన 31 డిమాండ్లను పరిశీలించి, ఈ నెల 11 లేదా 12వ తేదీల్లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని పీవో రోహిత్ గోపిడి తెలిపారు. తన పరిధిలో సాధ్యమయ్యే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని, మిగతా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. అనంతరం చెంచులు సమావేశమై పీవో సమావేశం ఏర్పాటు చేసే వరకు తమ పాదయాత్రను వాయిదా వేసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో చెంచు నాయకులు తిరుపతయ్య, రాజు, బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

అడవి బిడ్డల పోరుబాట

- పాదయాత్రకు మూడోసారి సిద్ధమైన చెంచులు
- మన్ననూర్‌లో అటవీశాఖ అధికారుల చర్చలు
- ఆగస్టు 12లోగా పరిష్కరిస్తామని హామీ


చెంచులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి

నాగర్‌కర్నూల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం అడవి బిడ్డల ఆందోళన మూడు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. నల్లమల అటవీ ప్రాంతం తమ ప్రాణమని, ఆదిమ జాతిని కాపాడుకుంటామని పాలకులు ఇస్తున్న హామీలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన ఉండటం లేదు. దాంతో అడవి బిడ్డలు తమ ఆక్రందన వినిపించడానికి మూడోసారి గురువారం చలో అసెంబ్లీ పాదయాత్రకు సిద్ధం అయ్యారు. మన్ననూర్ నుంచి పాదయాత్ర ప్రారంభించే క్రమంలో ఐటీడీఏ పీవో వారితో మాట్లాడారు. ఆగస్టు 12లోపు 70 శాతం సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మూడు దశాబ్దాల పోరాటం

అటవీ ప్రాంతంలో ఉత్పత్తులు కనుమరుగవుతున్నాయని, మైదాన ప్రాంతాలకే ప్రాధాన్యం ఇస్తున్న ప్రజాప్రతినిధులు తమకు కనీసం రక్షిత మంచినీటి వ్యవస్థ కూడా ఏర్పాటు చేయడం లేదని చెంచు పెంటల అడవి బిడ్డలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తమ హక్కుల సాధన కోసం 2008లో నల్లమల నుంచి మహబూబ్‌నగర్ వరకు చెంచులు పాదయాత్ర ప్రారంభించారు. అప్పటి కలెక్టర్ జగదీశ్వర్ తెలకపల్లిలో వారితో చర్చలు జరిపి, 90 రోజుల్లో పక్కా గృహాలు నిర్మిస్తామని, రక్షిత మంచినీరు, విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్‌గా వ్యవహరించిన నాదెండ్ల మనోహర్ కూడా నల్లమలలో పర్యటించి, చెంచుల జీవితాల్లో వెలుగులు నింపుతామని హామీ ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గవర్నర్ తమిళిసై కూడా అప్పాపూర్‌లో పర్యటించారు. ఎన్ని హామీలిచ్చినా తమ బతుకుల్లో మార్పు రాకపోవడంతో అడవి బిడ్డలు ఆవేదనతో రగిలిపోతూనే ఉన్నారు.

చెంచుల ప్రధాన డిమాండ్లు ఇవే

తమ సమస్యలు పరిష్కరించాలని మూడు దశాబ్దాలుగా చెంచులు డిమాండ్ చేస్తున్నారు. అందులో కొత్త వాటిని చేర్చకపోయినా ఉన్న వాటిని తీర్చడంలో పాలకపక్షాలు వెనుకడుగు వేస్తున్నాయి. అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో దాదాపు పదివేల మంది చెంచులు నివసిస్తున్నారు.

- విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, ఉపాధి రంగాలల్లో స్పెషల్ కోటాను కేటాయించాలి.
- మన్ననూర్‌లో ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ అనే ప్రభుత్వ సంస్థకు నూతన భవనం నిర్మించడంతోపాటు ప్రాజెక్టు ఆఫీసర్ పోస్టును వెంటనే మంజూరు చేయాలి.
- ఆరోగ్యం, విద్య, ఉపాధి, ఎన్ఆర్ఈజీఎస్, అగ్రికల్చర్, టీసా వంటి ముఖ్యమైన రంగాలకు సంబంధించిన అధికారులను, ఐటీడీఏకు ఐఏఎస్ స్థాయి కలిగిన అధికారిని నియమించాలి.
- 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం చెంచు పెంటలకు ఉమ్మడి హక్కులను గుర్తించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో దానిని అమలు చేయాలి.
- ఫారెస్టు అధికారుల వేధింపులు ఆపాలి.
- అడవిలో ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఉత్పత్తులకు మార్కెటింగ్, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలి.
- ఈర్లపెంట, మేడిమొలకల, సంగడిగుండాలను కలిపి ఒక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి.
- కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన చెంచులకు తక్షణం నష్ట పరిహారం చెల్లించాలి.

పర్యాటకాభివృద్ధికి సహకరించాలి

- ఏపీ సీఎం చంద్రబాబును కోరిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- మద్దిమడుగు- మాచర్ల మధ్యలో అంతర్రాష్ట్ర వంతెన నిర్మించాలని వినతి
- కృష్ణమ్మకు గంగా హారతి సమర్పించిన ఆంధ్రా- తెంగాణ నాయకులు


ఏపీ సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

దోమలపెంట, ఆగస్టు 1: తెలంగాణ- ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో ఉన్న నల్లమల ప్రాంతాన్ని పర్యాటకపరంగా అభివృద్ధికి ఇరు రాష్ట్రాలు కృషి చేయాలని, అందుకు తమరు సహకరించాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడిని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కోరారు. గురువారం శ్రీశైలం జలాశయం సందర్శనకు వచ్చిన ఏపీ సీఎంతో కలిసి జల హారతిలో పాల్గొని కృష్ణమ్మకు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ఎమ్మెల్యే శాలువాతో సన్మానంచేసి పుష్పగుచ్ఛం అందించారు.

అనంతరం సీఎంతో మాట్లాడుతూ శ్రీశైలం దేవస్థానం పాలకమండలిలో అచ్చంపేట వారికి అవకాశం కల్పించాలని, శ్రీశైలంలో తెలంగాణ అతిథి గృహం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరడం జరిగింది. నల్లమల చెంచులకు ఆరాధ్య దైవం భ్రమరాంబ మల్లికార్జునస్వామి అని, అమ్రామాద్ మండల చెంచులకు దేవాలయంలో ఉపాధి కల్పించాలని, ఆంధ్రా- తెలంగాణలో ఇంకా వ్యాపార సంబంధాలు మెరుగు కొరకు మద్దిమడుగు- మాచర్లకు రాకపోకలు ఏర్పడేందుకు అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున్, అలువేల, నాయకలు గురువయ్య, మోయిజోద్దీన్, మెహరాజ్, కుమార్, హరినారాయణగౌడ్, మల్లేష్ ప్రతాప్‌రెడ్డి, రవి, బాలయ్య ఉన్నారు.


రద్దీగా మారిన శ్రీశైలం- హైదరాబాద్ రహదారి

ట్రాఫిక్ ఆంక్షలు

దోమలపెంట, ఆగస్టు 1: తెలంగాణ- ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న శ్రీశైలం డ్యాం సందర్శనకు గురువారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట, ఈగలపంట, పాతాళగంగ గ్రామాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆంధ్ర పోలీసులు ట్రాఫిక్‌ను నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. కృష్ణమ్మకు గంగా హారతిలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆహ్వానం పంపినా అక్కడి పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో డ్యాంపైకి వెళ్లేందుకు ఆయనను అరగంట పాటు పోలీసులు నిలిపివేశారు. ఎట్టకేలకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్‌రెడ్డి పోలీసులతో మాట్లాడి డ్యాంపైకి పిలిపించారు.

- శ్రీశైలం డ్యాం 10 గేట్లు ఎత్తడంతో సందర్శకుల తాకిడి మొదలైంది. గురువారం ఉదయం తెలంగాణ ప్రాంతం నుంచి వేలాది వాహనాలు రావడంతో దోమలపెంట ఈగలపెంట, ఎడమ పాతాళగంగ, డ్యాం సమీపంలో రద్దీ ఏర్పడింది. అంతేకాకుండా ఏపీ సీఎం డ్యాం సందర్శన ఉదయం 10:30 గంటలకు ఉండగా ఆంధ్ర పోలీసులు తెలంగాణ వైపు ఉన్న ఈగలపెంట, దోమలపెంట గ్రామాలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి వాహనాలను నిలిపివేశారు. చంద్రబాబు నాయుడు మధ్యాహ్నం ఒంటి గంటకు తిరుగు ప్రయాణం అనంతరం వాహనాల రాకపోకలకు ఏపీ పోలీసులు అనుమతిచ్చారు. దీంతో నాలుగు గంటల పాటు శ్రీశైలం దర్శనానికి వచ్చిన భక్తులు, డ్యాం సందర్శనకు వచ్చిన పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దైవ దర్శనానికి వచ్చి కృష్ణానదిలో వృద్ధుడి గల్లంతు



యాదయ్య (ఫైల్)

దోమలపెంట, ఆగస్టు 1 : శ్రీశైలం దైవ దర్శనానికి వచ్చి కృష్ణానది ఎడమ పాతాళగంగలో ఓ వృద్ధుడు గల్లంతైన సంఘటన గురువారం చోటుచేసుకున్నది. నాగర్‌కర్నూలు జిల్లా ఈగలపెంట ఎస్‌ఐ వీరమల్లు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన చొప్పరి యాదయ్య (65)తో పాటు హమాలీ పని చేసే మరో పదిమంది కలిసి గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు శ్రీశైలం దైవ దర్శనానికి బయలుదేరారు. ఎనిమిది గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం ఎడమ పాతాళగంగలో స్నానం చేస్తుండగా శ్రీశైలం డ్యాం గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటి ప్రవాహానికి యాదయ్య నదిలో కొట్టుకుపోయాడు. స్థానిక మత్స్యకారులతో నదిలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ తెలిపారు. యాదయ్య భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 1 : వినియోగదారుల హక్కుల పరిరక్షణకు నిస్వార్థంగా పాటుపడాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ నూతనంగా ఏర్పడిన ఉమ్మడి జిల్లా కమిటీ గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయేందిర బోయిని కలిసినప్పుడు వారినుద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రజలకు సంబంధించిన కార్యక్రమాలకు తన ప్రోత్సాహం ఉంటుందని, నిబంధనలకు కట్టుబడి పనిచేయాలని ఆమె సూచించారు.

● బాధ్యతగా వ్యవహరించండి

నూతనంగా ఏర్పడిన జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ జానకి సూచించారు. గురువారం కమిటీ సభ్యులు పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆమెను కలిసి పూల మొక్కను అందజేసి, తమ కమిషన్ చేసే కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ దక్షిణ భారత బాధ్యుడు మనోహర్‌గౌడ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చైర్మన్ బాలరాజు, వైస్ చైర్మన్ మడుగు శివశంకర్, ప్రధాన కార్యదర్శి ఎం.చందు, కార్యదర్శి అలి, మీడియా కార్యదర్శి రాజసింహుడు పాల్గొన్నారు.

12 నుంచి బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 1 : పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ విద్యార్థులకు ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పీయూ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఈ నెల 13 నుంచి 19 వరకు మూడవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రు మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రుమెంట్ పరీక్షలు ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. వీటితో పాటు బీఈడీ విద్యార్థులకు ఫేజ్-1 ప్రాక్టికల్స్ పరీక్షలను 21 నుంచి 27వ తేదీ వరకు, ఫేజ్-2 ప్రాక్టికల్స్ పరీక్షలు 28 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు పీయూ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

రాజాపూర్. ఆగస్టు 1 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మం డలం దొండ్లపల్లి గ్రామంలో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుం ది. ఎస్‌ఐ కే.రవి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వానరాసి కృష్ణయ్య (65) మంగళవారం చేపల వేటకని గ్రామ శివారులో ఉన్న తాతకుంటకు వెళ్లాడు. వల కాళ్లకు చుట్టుకొని, నీటిలో మునిగి చనిపోయాడని, గురువారం ఉదయం కుంట సమీపంలో మేక లు మేసే వ్యక్తి గుర్తించి, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచా రం అందించడంతో విషయం తెలిసింది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొన సాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన
» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి
» 289కి పెరిగిన మరణాలు


పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు– ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అశ్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!
» జూలై 13న గాజాలో అంతం చేశాం
» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం
» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)



వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు
» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా.' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేందర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

హత్యకేసు నిందితుల అరెస్టు కోసం రాస్తారోకో

» న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌లో సెల్‌టవర్ ఎక్కిన హతుని సోదరుడు


పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 1 : తమ సోదరుడిని కొంతమంది దుండగులు అతి కిరాతకంగా నరికి చంపి నేటికీ ఏడాది కావస్తున్నా నిందితులను అరెస్టు చేయకపోవడం పట్ల బాధిత కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పెద్దకొత్తపల్లి మండలం దేవినేనిపల్లి గ్రామానికి చెందిన బోడమోని కాశన్నను గతేడాది ఆగస్టు 1న పట్టపగలు హత్య చేశారని, నిందితులను అరెస్టు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని హతుని సోదరుడు బోడమోని శివకాశీ, హతుని భార్య సునిత, తల్లి బాలమ్మ, కుటుంబ సభ్యులు రామకృష్ణ, నర్సింహ, వెంకటయ్య ఆరోపించారు. గురువారం పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో రహదారిపై బాధిత కుటుంబ సభ్యులు, దేవినేనిపల్లి గ్రామస్థులు బైఠాయించారు. దీంతో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ వెళ్లే వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. స్థానిక పోలీసులు వారికి నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌ను హతుని సోదరుడు శివకాశీ ఎక్కి మూడు గంటల పాటు ఉండిపోయాడు. దీంతో స్టేషన్‌లో ఉన్న పోలీసులు అయోమయానికి గురయ్యారు. సెల్‌టవర్ నుంచి కిందికి దిగమని ఎస్ఐ సతీష్‌తోపాటు పోలీసులు పలు మార్లు విజ్ఞప్తి చేసినా వినిపించుకోలేదు. కొల్లాపూర్ సీఐ మహేష్ పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని టవర్ దిగమని విజ్ఞప్తి చేశారు. టవర్ ఎక్కిన శివకాశికి ఉన్నతాధికారులు ఫోన్ చేసి హామీ ఇవ్వడంతో మీ అన్న విషయంలో అన్యాయం జరిగింది.. రీఎంక్వైరీ చేసి హంతకులను అరెస్టు చేసి న్యాయం చేస్తామని చెప్పడంతో కిందికి దిగాడు. న్యాయం జరగకపోతే పోలీస్‌స్టేషన్ ముందు ఆత్మహత్య చేసుకుంటామని శివకాశీ హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

దేవినేనిపల్లి గ్రామానికి చెందిన బోడమోని కాశన్న అనే వ్యక్తిని హత్య చేసిన నిందితులను గుర్తించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని కొల్లాపూర్ సీఐ మహేష్ అన్నారు. హతుని సోదరుడు శివకాశీ ఫిర్యాదు మేరకు ఆ సంఘటనపై సమగ్ర విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు. అప్పట్లో బోడమోని కాశన్న హత్యకు గురైన సంఘటనపై హతుని సోదరుడు శివకాశీ చేసిన ఫిర్యాదు మేరకు పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నెంబరు 101/2023 అండర్ సెక్షన్ 302 రిట్‌విత్ 33 కింద కేసు నమోదు చేసినట్లు సీఐ మహేష్ వివరించారు. గతేడాది నవంబరు 30న కోర్టుకు చార్జ్‌షీట్‌ను దాఖలు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కేసులో తమకు న్యాయం జరగలేదని హతుని సోదరుడు ఉన్నతాధికారులకు విన్నవించుకోవడంతో కేసులో ఇంకా సాక్షులను సేకరించి న్యాయం చేసేందుకు కోర్టుకు నివేదిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా, టవర్ ఎక్కి బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి : మాజీ మంత్రి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, ఆగస్టు 1 : సీనియర్ శాసనసభ్యురాలు, రాష్ట్ర మహిళా మంత్రులుగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలను నిండు శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు దుర్మార్గమని వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు ఆ పదవికే కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. కష్టపడితేనే మో, పార్టీలు మారుతేనే మో అనుకోకుండా వచ్చిన పదవిని అడ్డం పెట్టుకొని శాసనసభలో అందరిని గౌరవించాల్సింది పోయి ప్రతిపక్ష సభ్యులపై ఇష్టానురీతిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. సీటు మీద కూర్చున్న మొదటిరోజు నుంచి ప్రతిపక్ష నాయకులపై అడ్డగోలు విమర్శలు చేస్తున్నార న్నారు. మాజీ మంత్రి సీనియర్ శాసనసభ్యురాలైన సబితా ఇంద్రారెడ్డిని అసెంబ్లీ సాక్షిగా అక్కలను నమ్ముకుంటే మునుగుతారు.. బతుకు బస్టాండ్ అవుతుందని అవమానించడం పట్ల ముఖ్యమంత్రికి మహిళలంటే ఎంత చిన్నచూపో అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో పాలన మొత్తం శూన్యం చేశారన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను వాళ్ల ఇళ్లకు వెళ్లి బేరాలు ఆడి పార్టీలో చేర్చుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నోరు అదుపులో పెట్టుకుని విమర్శలు మానకపోతే కాంగ్రెస్ అధినాయకత్వమే మిమ్మల్ని ఆ సీటు నుంచి తప్పించే రోజులు వస్తాయని తస్మాత్ జాగ్రత్త.. అని హెచ్చరించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మను దహనం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు నాగన్నయాదవ్, రవి, మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్ తదితరులున్నారు.

విలేకరిపై నమోదైన అక్రమ కేసులు ఎత్తివేయాలి

- జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ఎస్పీకి వినతి పత్రం



మధుసూదన్‌రెడ్డిపై కేసు ఎత్తివేయాలని ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 1 : జర్నలిస్టు మధుసూదన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును తక్షణమే ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లాఖాన్ డిమాండ్ చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్లాఖాన్ మాట్లాడుతూ బిజినేపల్లి మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన జర్నలిస్టు మధుసూదన్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన కొంతమంది గిట్టని వారు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కొంతమంది రాజకీయంగా కక్షసాధింపు కోసం ఒక మహిళను పావుగా చేసుకుని ఇలాంటి కేసు నమోదు చేయడానికి పూనుకున్నారని అన్నారు. జర్నలిస్టుగా మధుసూదన్‌రెడ్డి రాసిన వార్తలను జీర్ణించుకోలేక తప్పుడు కేసులు పెట్టించారని పేర్కొన్నారు. ఆ మహిళ ఫిర్యాదు చేసిన రోజు సదరు విలేకరి గ్రామంలోనే ఉన్నాడని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుకి మద్దతుగా బిజినేపల్లి పోలీస్‌స్టేషన్ ముందు వెల్గొండ గ్రామస్థులంతా ఆందోళన చేసిన విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు చంద్రశేఖర్ రావు, జెమిని సురేష్, కందికొండ మోహన్, పుట్టపాగ వెంకటస్వామి, ఉమాశంకర్, ఖానాపూర్ ప్రదీప్, రాజేష్‌గౌడ్, మహమ్మద్ సాజిద్, ఏటిగడ్డ వెంకటేశ్, బాలస్వామి, సత్యం, ఎండి.సాధిక్, సుధాకర్‌రెడ్డి, ఇర్ఫాన్, రామకృష్ణ, రియాజ్, మాధవరెడ్డి, ఫోటో జర్నలిస్టులు కపిలవాయి రాజు, వీరేందర్‌గౌడ్ ఉన్నారు.

లీజును రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతి

వెల్దండ, ఆగస్టు 1 : తమకు తెలియకుండా తమ పొలాలను కొందరు వ్యక్తులు అక్రమంగా మైనింగ్ లీజు చేసుకున్నారని ఆరోపిస్తూ గురువారం పలువురు రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. చెదురుపల్లి గ్రామ శివారులోని సర్వేనంబరు 76లోగల 12 ఎకరాల తమ పొలంలో మైనింగ్ లీజు చేసుకున్నాడని ఎరుకలి వీరయ్య, రేఖ్యానాయక్, దేశ్య, దోలి అను రైతులు ఆందోళన చేసి లీజును రద్దుచేయాలని తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

అస్తవ్యస్త రోడ్లను మరమ్మతు చేపట్టాలి

చారకొండ, ఆగస్టు 1: మండల కేంద్రంలో అస్తవ్యస్తంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎంజేఎస్ సెంట్రల్ కమిటీ సభ్యుడు రాధాకృష్ణ మహరాజ్, మండల ధర్మ సమాజ్‌పార్టీ నాయకులు అన్నారు. గురువారం చారకొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిలో భాగంగా మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు బైపాస్ రోడ్డు పనులు చేపట్టడంతో మండల కేంద్రంనుంచి మర్రిపల్లి వరకు మూడు కిలోమీటర్లు రోడ్డు గుంతల మయంగా మారిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోడం లేదని అన్నారు. అనంతరం రోడ్డు మరమ్మతులు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో మండల ధర్మసమాజ్ పార్టీ నాయకులు మల్లేష్ కొండల్, అయోధ్య, ఉదయ్, ప్రవీణ్, వెంకటయ్య, విజయ్ తదితరులున్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నాం

కల్వకుర్తి, ఆగస్టు 1 : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలందిస్తున్నామని జిల్లా ఎస్ఈ లీలావతి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని హరిహర టౌన్‌షిప్‌లో స్థానిక ఏఈ శ్రీనివాస్‌నాయక్‌తో కలిసి ఆమె పర్యటించారు. కాలనీలో విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తక్షణమే ఏఈ ఆధ్వర్యంలో సిబ్బంది పని చేస్తూ వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరిస్తున్నారని ఎస్ఈకి స్థానికులు తెలిపారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అందుబాటులో మెటీరియల్ లేకపోతే కొంత ఆలస్యమవుతుందని తెలిపారు. అనంతరం కాలనీవాసులు ఎస్ఈని పూల మాలలు, శాలువాలతో సత్కరించారు.

'ప్రభుత్వ భూములను పరిరక్షించాలి'

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 1 : ప్రభుత్వభూములను పరిరక్షించాలని మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. గురువారం ఆయన పట్టణ పరిధిలోని మునిసిపాలిటీకి సంబంధించిన ఖాళీ ప్రదేశాలను గుర్తించి కంచె నిర్మాణం చేసే పనులను పరిశీలించి మాట్లాడారు. గతంలో గ్రామపంచాయతీగా ఉన్నపుడు చేసిన లేఅవుట్లకు నిబంధనల ప్రకారం అనుమతి నిమిత్తం గ్రామపంచాయతీకి కేటాయించిన ఖాళీ స్థలాలను అభివృద్ధి చేసేందుకు కంచె నిర్మాణం చేయనున్నట్లు ఆయన వివరించారు. వైస్ చైర్మన్ షాహెద్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకుర్తివాసి ప్రసన్నకు డాక్టరేట్



కల్వకుర్తిటౌన్, ఆగస్టు 1 : కల్వకుర్తికి చెందిన అల్లాడి ప్రసన్నకు జంతుశాస్త్ర విభాగంలో డాక్టరేట్ పొందినట్లు ఆమె కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి జంతుశాస్త్రవిభాగంలో భాగంగా డిండి ప్రాజెక్టు జలజీవరాసులపై పరిశోధన చేసినందుకుగాను ఆమెకు డాక్టరేట్ వచ్చిందని పేర్కొన్నారు. డాక్టర్ ప్రసన్న ఊర్కొండపేటలో ప్రాథమిక విద్య, కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, జడ్చర్ల డాక్టర్ బి.ఆర్ డిగ్రీ కళాశాలలో జువాలజీలో డిగ్రీ పూర్తి చేసిందని, అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ జువాలజీ పూర్తిచేసిన అదే యూనివర్సిటీలో జుప్లాంటికల్ డైవర్సిటీ అండ్ కెమికల్ క్వాంటిటీస్ అనే విభాగంలో డాక్టరేట్ చేసిందని వారు వివరించారు. డిండి ప్రాజెక్టులోని జలచరాలు నీటి మొక్కలు శిలజాలు కెమికల్ రసాయన చర్యలపై పరిశోధనలు చేసినందుకుగాను గౌరవ డాక్టరేట్ వచ్చిందన్నారు.

పాదయాత్రకు పూనుకోవడం సరికాదు

మన్ననూర్, ఆగస్టు 1: చెంచు సంఘాలను సంప్రదించకుండానే కేవలం రెండు గ్రామాల చెంచులు అసెంబ్లీకి పాదయాత్రకు పూనుకోవడం సరైన పద్ధతి కాదని మన్ననూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు ఖండించారు. ఆయన స్థానిక చెంచు నాయకులతో కలిసి మన్ననూరులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవలే సంఘం తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కకు చెంచు సేవా సంఘం తరపున చెంచుల సమస్యలన్నీ విన్నవించామని, తమ హామీ వారి వద్ద ఉందని, ఇవేవీ తెలుసుకోకుండా ఆదరాబాదరాగా పాదయాత్రకు పూనుకుంటే చెంచుల సమస్యలు ఎలా సాధ్యమవుతాయని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌గా పనిచేసిన మల్లికార్జున్ చెంచులను పట్టించుకోకుండా మధ్యలోనే పదవికి రాజీనామా చేశారని విమర్శించారు. సమావేశంలో చెంచు సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి నాగయ్య, జిల్లా చెంచు సేవా సంఘం ప్రధాన కార్యదర్శి దాసరి రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణ పాల్గొన్నారు.

భాగస్వామ్యం చేయాలి: కలెక్టర్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రజలతో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై ర్యాలీలు మీటింగులు ఏర్పాటు చేయాలని ఇందులో యువకులను, మహిళా సంఘాలను, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛదనం-పచ్చదనంపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ కే సీతారామారావు, జిల్లా అధికారులు కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుంచి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

జిల్లా వైద్యాధికారిగా స్వరాజ్యలక్ష్మి



కలెక్టర్ సంతోష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 1: జిల్లా నూతన వైద్యాధికారిగా స్వరాజ్యలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పని చేసిన ఆమె ఇక్కడ జిల్లా డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇక్కడ పని చేసిన డాక్టర్ సుధాకర్ లాల్ జీహెచ్ఎంసీ పరిధిలోని శేరిలింగంపల్లి డీఎంహెచ్‌వోగా బదిలీపై వెళ్లారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- సింగోటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



సింగోటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కొల్లాపూర్, ఆగస్టు 1 : విద్యార్థులు పది పరీక్షల్లో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సింగోటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ బదావత్ సంతోష్ పిలుపునిచ్చారు. గురువారం కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న నిర్మాణ పనులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతాన్ని పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు గోవిందుగౌడ్‌తో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉన్న వంట గదిని పరిశీలిస్తూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే విధానాన్ని ఆయన గమనించారు. భోజనం నాణ్యతపై దృష్టి పెట్టాలని వంట ఏజెన్సీలకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లులు కూడా ఇకనుంచి సకాలంలో అందుతాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనాన్ని రుచికరంగా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాలలోనే కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న 97మంది విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు వచ్చేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పది పరీక్షల్లో పదికి పది వచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో ఇంకా విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో నాగరాజు, కొల్లాపూర్ తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, ఎంపీవో మనోహర్, స్కూల్ కాం ప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందుగౌడ్, ఎంఐఎఫ్ కో ఆర్డినేటర్ విష్ణు పాల్గొన్నారు.

సింగోటం ఆలయంలో ప్రత్యేక పూజలు

సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని గురువారం కలెక్టర్ బదావత్ సంతోష్ సందర్శించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ కలెక్టర్ ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం లక్ష్మీనరసింహున్ని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. సింగోటం శ్రీవారి సముద్ర నీటి నిల్వ సామర్థ్యాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందించే బాలామృతం, గుడ్లను పరిశీలించారు.

పల్లె దవాఖాన సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రజల ఆరోగ్య అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో నాగరాజు, కొల్లాపూర్ తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, ఎంపీవో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై అంతిమ విజయం ధర్మానిదే

- ఎంఆర్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ



నాగర్‌కర్నూల్‌లో మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై ముప్పై ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో అంతిమ విజయం ధర్మానిదేనని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ అన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. మాదిగ ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కోళ్ల శివ మాట్లాడుతూ అసమానతలు ఉన్న సమాజంలో రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు బెంచి తీర్పు ఇవ్వడం భారతదేశ చరిత్రలో చరిత్రాత్మకమైనదిగా అభివర్ణించారు. మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వంకేశ్వరం నిరంజన్, ప్రభాకర్, జానయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గూట విజయ్, గడ్డం విజయ్, మాజీ జడ్పీటీసీ మణెమ్మ, మాదిగ ప్రజా సంఘాల నాయకులు పృథ్వీరాజ్, పోలే భాస్కర్, వెంకటయ్య, నాగయ్య, నరేందర్, గుడిపల్లి రవి, యాకోబు, పరుశురాములు, అశోక్, పరమేశ్వర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: ఎస్సీ వర్గీకరణ సమంజసమేనని సుప్రీంకోర్టు అందుకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, ప్రజలు ముప్పై సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగి విజయ్ మాట్లాడుతూ ఎస్సీ కేటగిరిలోని వివిధ ఉప కులాల జనాభా ప్రాతిపదికన వర్గీకరణ ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలు లభించడం ద్వారా సరైన న్యాయం దక్కుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఏ ఒక్క ఎస్సీ ఉపకులానికి అన్యాయం జరగదని, ప్రతీ ఒక్కరికి వారి జనాభా లెక్కల ప్రకారం అవకాశాలు పొందుతారని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ప్రతీ ఒక్క పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మిద్దె రాములు, పానుగంటి బాలస్వామి, మంగి విల్సన్, పరశురాములు, మంగి రాజు, రాంచందర్, మొల్గర రాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చింది చారిత్రాత్మక తీర్పు అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిన సందర్భంగా గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు, బీజేపీ నాయకులు స్వీట్లు పంచుకున్నారు. నాయకులు గొలిరాజు, శంకర్ గౌడ్, శ్రీనివాస్, నరేష్, చందులాల్, శివచంద్ర, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

● అమ్రాబాద్: ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటానికి ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో ఫలితం వచ్చిందని ఎమ్మార్పీఎస్ అమ్రాబాద్ మండల అధ్యక్షుడు కొయ్యల వెంకటేష్ గురువారం హర్షం వ్యక్తం చేశారు. అమ్రాబాద్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. ఎమ్మెస్ఎఫ్ సీనియర్ నాయకులు శివ, వెంకటయ్య, రాములు, దానయ్య, మల్లయ్య లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్: గడిచిన 30 సంవత్సరాల నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ నేతృత్వంలో కొనసాగిన ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ముగింపు పలికేలా సుప్రీంకోర్టు న్యాయమైన తీర్పు వెలువరించిందని హర్షిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్, ఎంఎస్పీల ఆధ్వర్యంలో ఊరూరూ, వాడవాడలా సంబురాలు నిర్వహించారు. కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చుతూ మిఠాయిలు పంచుతూ సుప్రీంకోర్టును తీర్పును హర్షిస్తూ సంబురాలు చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రమోని యాదగిరి మాదిగ, ఎంఎస్పీ నా యకులు మంద నరసింహ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగులపల్లి లక్ష్మయ్య, శీలం అగ్రస్వామి, పుట్టపాగ రాములు మాట్లాడారు. అదే విధంగా డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీ ఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్, ఎంఎస్పీ నాయకులతో పాటు బీజేపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఉప ప్రధాని దివంగత బాబుజగ్జీవన్ రావు విగ్రహానికి పూల ు వేసి నివాళులర్పించారు. నాయకులు శ్రీనివాస్, మిద్దె కృష్ణయ్య, మధు సంగెం, బుసపుల కుర్మయ్య, సురేష్, రమేష్, నిరంజన్, కృష్ణయ్య, పుట్టపాగ రవి, పుట్టపాగ రాము, చిన్న సంగెం, బొరెల్లి కృష్ణ, శ్రీను, వెంకటస్వామి, పరశు రాముడు, తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ సాగించిన పోరాటం ఫలించిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మబ్బు సాయన్నమాదిగ అన్నారు. ఏబీసీడీ వర్గీకరణకు దేశ సర్వోన్నత న్యాయస్థానం అనుకూలంగా తీర్పునివ్వడం హర్షదాయకమని పేర్కొన్నారు. పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి, మందకృష్ణమాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు కృష్ణ, రామరాజు, జగన్, మల్లేష్, శేఖర్, సురేష్, విష్ణు తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు



నాగర్‌కర్నూల్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 1: అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలో చేపట్టిన సీఎం దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. నిరసనలో పాల్గొన్న వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు అయిన వారందరికి వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అర్థం రవి, భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు ప్రజల మన్ననలు అందుకుంటూ కార్యకర్తల ఆశీర్వాదంతో అనేక త్యాగాలతో ప్రజలకు సేవ చేస్తున్న ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి సునితా లక్ష్మారెడ్డి ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వారిని నమ్ముకుంటే ఆగమైతావంటూ కేటీఆర్‌కు సూచనగా మహిళలు అని చూడకుండా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సీఎం తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ఆడబిడ్డలకు బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మహిళలను గౌరవించాలి

కల్వకుర్తిటౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలను గౌరవించాలని మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. గురువారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి, రహదారిపై నిరసన తెలిపి మాట్లాడారు. శాసనసభలోని మహిళా ఎమ్మెల్యేలపై నిండుసభలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి అన్నమాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రజాప్రతినిధులకే రక్షణ లేకుంటే సామాన్య మహిళలకు ఎలాంటి రక్షణకల్పిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రహదారిపై నిరసన తెలపడంతో వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వచ్చి నిరసన కార్యక్రమాన్ని విరమింపచేశారు. మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌గౌడు, బీఆర్ఎస్ నాయకులు సూర్యప్రకాష్‌రావు, గోవర్దన్, దారమోని గణేష్, లింగం, కిషోర్, కృష్ణ, తాళ్ల సురేష్, విష్ణు, శ్రీను, సత్యం, వెంకటేష్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

● వెల్దండ : అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బీఆర్ఎస్ నాయకులు మండలకేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను నాయకులు దహనం చేశారు. రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు చల్లా మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటయ్య, యువజన విభాగం అధ్యక్షుడు యాదగిరి, పోలే అశోక్, ప్రవీణ్, రవికుమార్, కొండల్‌యాదవ్, చంద్రశేఖర్, ఆనందు, శేఖర్, వెంకటేష్, పిల్లిశ్రీను, మల్లేష్, గణేష్ ఉన్నారు.

● అచ్చంపేటటౌన్: మహిళలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, మహిళా ఎమ్మెల్యేలపై పలు వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శంకర్ మాదిగ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసనగా బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. నాయకులు వెంకటయ్య, సైదులు, వంశీ, సమ్మద్, కరుణాకర్, పరమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: ఎమ్మెల్యే సబితారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గిరినాయక్, మాజీ సర్పంచులు మ్యాకల శ్రీనివాసులు, కృష్ణగౌడ్, కొమ్ము రాజయ్య, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

గంజాయితో పట్టుబడిన ఇద్దరి అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 1 : గంజాయితో పట్టుబడిన ఒక మైనర్, ఒక యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బైక్‌పై 15గంజాయి ప్యాకెట్లు మైనర్(బాలుడు)తోపాటు యువకుడు తరలిస్తుండగా బుధవారం పట్టుకున్నారు. వీరు గంజాయిని హైదరాబాద్‌లోని ధూల్‌పేట్ నుంచి తీసుకొస్తున్నట్లు విచారణలో తేలింది. వీరి వద్ద గంజాయితో పాటు ఒక బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకున్నారు. ఈ సంఘటనపై మైనర్ బాలుడుతో పాటు మరో యువకుడు సాబేర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గోవర్ధన్ తెలిపారు. గంజాయి గ్యాంగ్‌లో 15మంది అనుమానితులు ఉన్నట్లు జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. వారిలో ఒక్కొక్కరిని పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 1 : మునిసిపల్ పరిధిలో వివిధ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం, కేవీపీఎస్ నాయకులు కోరారు. గురువారం వారుపట్టణంలోని రాఘవేంద్రకాలనీ, బలరాంనగర్ కాలనీల్లోని ప్రజలతో వారు మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆంజనేయులు, జిల్లా నాయకుడు బాల్‌రెడ్డి, కేవీపీఎస్ నాయకుడు పరశురాములు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వర్, మహమ్మద్‌కాలిక్ తదితరలు పాల్గొన్నారు.

అక్షర దండోరా పుస్కకావిష్కరణ



అక్షర దండోరా పుస్కకావిష్కరణ చేస్తున్న మాదిగ ఉద్యోగుల సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 1: ప్రముఖ కవి, సంపాదకులు డప్పుల రమేష్ రచించిన 'అక్షర దండోరా' మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వంకేశ్వరం నిరంజన్ ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ మాదిగ ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం అనంతరం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత డప్పుల రమేష్ మాట్లాడారు. మాదిగ ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు గుడిపల్లి నిరంజన్, కోళ్ల శివ, గూట విజయ్, వంకేశ్వరం లక్ష్మయ్య, వంకేశ్వరం మణెమ్మ, గుడిపల్లి రవి, జానయ్య పృథ్వీరాజ్, రాంచందర్, పరుశురాములు, పోలె భాస్కర్, ఐతోలు లక్ష్మయ్య, గడ్డం విజయ్, మంతటి గోపి, నరేందర్, శ్రీనివవాస్, వంకేశ్వరం శ్రీనివాస్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో శంకర్‌నాయక్ బాధ్యతల స్వీకరణ

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 1 : మండల విద్యాధికారిగా బి.శంకర్‌నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడపనిచేసిన బాసునాయక్ హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు బదిలీపై వెళ్లినట్లు, వంగూర్ మండల విద్యాధికారిగా విధులు నిర్వహించిన శంకర్‌నాయక్ ఇక్కడకు బదిలీపై వచ్చినట్లు ఆయన వివరించారు. శాలువా పూలమాలలతో సన్మానించారు.

ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు

కల్వకుర్తి, ఆగస్టు 1 : ముర్రుపాలు పుట్టిన బిడ్డకు అమృతంతో సమానమని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ టీచర్ అలివేల అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను అంగన్‌వాడీ టీచర్ తల్లులకు వివరించారు. అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలోని వడ్డెర బస్తీ అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, డాక్టర్‌భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, మాధవి, జయమ్మ తదితరులు ఉన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేటఅర్బన్: తల్లిపాలతోనే పుట్టిన బిడ్డకు ఆరోగ్యకరంగా ఉంటుందని ఐసీడీఎస్ ఏసీడీపీవో కమల అన్నారు. గురువారం మండల పరిధిలోని సిద్దాపూర్ ఐనోల్ సెక్టార్ల పరిధిలో ఆయా గ్రామాలు చందాపూర్, ఐనోల్‌లో సూపర్‌వైజర్ స్వర్ణలత, అనితలు అంగన్‌వాడి కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. ఆశ వర్కర్లు కలమ్మ, అంగన్‌వాడీ టీచర్ అంజమ్మ, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

● చారకొండ: మండల కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ సెంటర్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రశీదునిసా, హెల్త్ సూపరింటెండెంట్ శేఖర్‌రెడ్డి మాట్లాడారు. సీహెచ్‌వో ఎన్డీవీచారి, ఏఎన్ఎం అలివేల, ఆశా కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

● బల్మూరు: తల్లిపాలతోనే పిల్లలు సురక్షితంగా ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. గురువారం మండల పరిధిలోని రామాజీపల్లి గ్రామంలో ఈనెల 1నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్‌తో పాటు గ్రామస్థులు, తల్లులు పాల్గొన్నారు.

● లింగాల: అమ్మ పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుంది కాబట్టి తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటిదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని రాయవరం, అంబట్‌పల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. అంగన్‌వాడీ టీచర్లు మంజుల, లలిత, జయమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం



కానిస్టేబుళ్లకు శాలువా, పూలమాలతో సన్మానం చేస్తున్న ఎస్ఐ రాజశేఖర్

చారకొండ, ఆగస్టు 1: మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్ల (పీసీ)లు రేణయ్య, అరుణచలం, భాస్కరచారిలను గురువారం ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో వారికి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, శ్రీశేలం, నాగయ్య తిరుమల్‌రావు, పీసీలు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండపేటలో వైద్య శిబిరం

ఊర్కొండ, ఆగస్టు 1: మండలంలోని ఊర్కొండపేటలో గురువారం గ్రామ పంచాయతీ ఆవరణలో కల్వకుర్తి వెంకటరమణ ఆసుపత్రి వైద్య బృందం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహించిన అనంతరం వారికి కావాల్సిన మెడిసిన్ అందించారు. గ్రామంలో 92 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. వైద్య బృందం ప్రణయ్, నరసింహ, నందు, రాజేష్ గ్రామస్థులు వహీదోద్దిన్, మధుసూదన్‌రెడ్డి, మన్సూర్, కృష్ణ, అశోక్, అనిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి అభివృద్ధికి కృషి చేయాలి



శివసేనారెడ్డిని కలిసిన కల్వకుర్తి కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 1 : కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి కోరినట్లు కల్వకుర్తి పట్టణకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో క్రీడాపరంగా అన్నీరకాలుగా అభివృద్ధి చేయాలని వినతి అందజేసినట్లు ఆయన వివరించారు. యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పుస్తకాల రాహుల్, యూత్ కాంగ్రెస్ స్టేట్ సెక్రటరీ కుడుముల చంద్రకాంత్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు ఎండీ ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి బదిలీ

కల్వకుర్తి, ఆగస్టు 1 : కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి బదిలీపై నాంపల్లి జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. వీపనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న రాంరెడ్డి కల్వకుర్తికి బదిలీపై వచ్చారు. కల్వకుర్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సురేందర్‌రెడ్డి పని చేసి కళాశాల అభివృద్ధి కోసం సుమారు రూ. 36లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేయించి కళాశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు. బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డికి విద్యార్థులు సన్మానించి కన్నీటితో వీడ్కోలు పలికారు. నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన రాంరెడ్డిని అధ్యాపకులు సన్మానించారు.

ప్రభుత్వ ఉద్యోగం ఎంతో బాధ్యతగలది

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 1 : ప్రభుత్వ ఉద్యోగం ఎంతో బాధ్యతగలదని ఎంపీడీవో వెంకట్రాములు అన్నారు. గురువారం మండల పరిధిలో వివిధ గ్రామాల్లో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవో ఇతర ప్రాంతాలకు వెళుతున్న వారికి, కొత్తగా బాధ్యతలు చేపట్టేవారికి సన్మాన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీవోలు సునీత, దేవేందర్, వంగూరు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన విజయభాస్కర్, గద్వాల్ నుంచి బదిలీపై వచ్చిన ఏఈఈగా బాధ్యతలు చేపట్టిన షబ్బీర్‌అహ్మద్, కార్యదర్శులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25లీటర్ల సారా స్వాధీనం

కల్వకుర్తి, ఆగస్టు 1 : ఎక్సైజ్, ఎన్‌ఫోర్సుమెంట్ డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్సు ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎన్‌ఫోర్సుమెంట్ మహబూబ్‌నగర్ టీం జరిపిన రూట్‌వాచ్‌లో తర్నికల్ తండాకు చెందిన రూప్‌సింగ్ 10లీటర్ల సారాను కల్వకుర్తికి తరలిస్తుండగా గుర్తించి సారా, బైక్‌ను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా కల్వకుర్తి పట్టణంతో పాటు తర్నికల్‌తండా, జీడిపల్లితండాల్లో జరిపిన దాడుల్లో 15లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 600బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు సీఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ శారద, డీటీఎఫ్ సీఐ అరుణ, సిబ్బంది మహేష్, రఘు, నర్స మాధవి, తిరుపతిరెడ్డి, మహేష్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.